నమస్తే తెలంగాణ
హనుమకొండ
5 | వరంగల్, గురువారం 26 డిసెంబర్ 2024 | HANUMAKONDA

హనుమకొండ సెంటినరీ బాప్టిస్టు చర్చి వద్ద క్రైస్తవుల సందడి

యేసు స్మరణలో..

చర్చిలో ప్రార్థనలు చేస్తున్న నిరంజన్ బాబు

- ఉమ్మడి జిల్లాలో ఘనంగా క్రిస్మస్
- చర్చిల్లో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు
- శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు

క్రిస్మస్ పండుగను బుధవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు గ్రీటింగ్స్ చెప్పుకుని ఉల్లాసంగా గడిపారు. పాస్టర్లు ప్రభువు సందేశాన్ని వినిపించారు. హనుమకొండలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చి, కాజీపేటలోని తెలుగు బాప్టిస్ట్, సీఎస్ఐ, కార్మెల్, సెయింట్ జోసెఫ్, వరంగల్‌లోని సీబీసీ, బేతెస్థ, మహబూబాబాద్‌లోని బిలివర్, షారోన్, ఎల్లదాయి, డోర్నకల్‌లోని సీఎస్ఐ, భూపాలపల్లిలోని జీఎంఎస్ఎస్ఎస్, బేతెస్థ, ములుగులోని హోలి మినిస్ట్రీస్, జనగామలోని సీబీసీ, యూనిక్, బేతేలు, కార్మెల్ తదితర చర్చిల్లో వేడుకలు అంబరాన్నంటాయి. పలువురు ప్రముఖులు ప్రార్థనా మందిరాలకు వెళ్లి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు.

– నమస్తే నెట్‌వర్క్, డిసెంబర్ 25

హనుమకొండలో చర్చికి వస్తున్న యువతులు

వరంగల్ లేబర్‌కాలనీలోని సీబీసీ చర్చిలో ప్రభువు సందేశాన్ని వినిపిస్తున్న పాస్టర్

చీకట్లో ప్రయాణమెట్ల?

- ఫాతిమా బ్రిడ్జిపై వెలగని వీధి దీపాలు.. గుంతలు, అడ్డదిడ్డంగా ప్యాచ్ వర్క్‌లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

కాజీపేట, డిసెంబర్ 25 : కాజీపేట పట్టణంలోని ఫాతిమా బ్రిడ్జిపై రాత్రివేళ అంధకారం కమ్ముకుంటున్నది. బ్రిడ్జిపై ఉన్న వీధి దీపాలు సగానికి పైగా వెలగకపోవడంతో వాహనదారులు చిమ్మ చీకట్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వేలాది వాహనాలు ఈ బ్రిడ్జిపై రాకపోకలు సాగిస్తుండడంతో రద్దీగా ఉంటుంది. రాత్రివేళ చిన్న వాహనదారుల పరిస్థితి దయనీయంగా మారింది. వారి వాహనాల లైట్లతోనే జాగ్రత్తగా ప్రయాణించాల్సి వస్తున్నది. ఈ బ్రిడ్జి ఇరుకుగా ఉండడంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుంటుంది. దీనికి తోడు బ్రిడ్జిపై పడిన గుంతలకు ఎన్‌హెచ్, ఆర్ అండ్ బీ అధికారులు అడ్డదిడ్డంగా ప్యాచ్‌వర్క్‌లు చేయడంతో మరింత ఇబ్బందిగా మారింది. ఎత్తు పల్లాల గుంతలను తప్పించే క్రమంలో వాహనాలు ఎదురెదురుగా ఢీకొంటున్నాయి. పాలకులు, అధికారులు స్పందించి బ్రిడ్జిపై విద్యుత్ దీపాలతో పాటు గుంతలకు మరమ్మతులు చేసి ప్రయాణం సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ఫాతిమా బ్రిడ్జిపై వీధి దీపాలు వెలగకపోవడంతో చీకట్లోనే ప్రయాణిస్తున్న వాహనదారులు

బల్దియాలో సీహెచ్‌వో రగడ

- డిప్యుటేషన్‌పై వచ్చిన మండల వ్యవసాయాధికారి
- అతడికే పోస్టింగ్ ఇవ్వాలని అధికార పార్టీ ఎమ్మెల్యే ఒత్తిడి
- ఎటూ తేల్చుకోలేకపోతున్న జీడబ్ల్యూఎంసీ కమిషనర్
- హోదాలు తేల్చాలంటూ అధికారులకు ఆదేశం

వరంగల్, డిసెంబర్ 25 : గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ పాలన వ్యవహారంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధుల జోక్యం ఎక్కువైంది. ఎవరికి ఏ పోస్టు ఇవ్వాలనే విషయాన్ని కూడా వారే నిర్ణయిస్తున్నారు. ఈ క్రమంలోనే బల్దియాలో చీఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ (సీహెచ్‌వో) పోస్టు భర్తీ రగడ రాజుకుంది. వరంగల్ జిల్లాకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యే తాను సిఫారసు చేసిన ఉద్యోగికే పోస్టింగ్ ఇవ్వాలని తీవ్ర స్థాయిలో కమిషనర్‌పై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. వ్యవసాయ శాఖ నుంచి ఓ మండల అధికారి బల్దియాలో ఏడాది కాలం పాటు విధులు నిర్వర్తించేందుకు రెండు రోజుల క్రితం డిప్యుటేషన్‌పై వచ్చారు. ఆయన అధికార పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే సిఫారసుతో వచ్చినట్లు సమాచారం. అతడికే సీహెచ్‌వో పోస్టు ఇవ్వాలని సదరు ఎమ్మెల్యే కమిషనర్‌పై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు బల్దియాలో చర్చించుకుంటున్నారు. అయితే ప్రస్తుతం అటవీ శాఖ నుంచి ఓ అధికారి ఇప్పటికే డిప్యుటేషన్‌పై వచ్చి హార్టికల్చర్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం డిప్యుటేషన్‌పై వచ్చిన అధికారిది హెచ్‌వోగా విధులు నిర్వర్తిస్తున్న అధికారి కంటే చిన్న ర్యాంక్. అయితే ఎమ్మెల్యే దీనిని పట్టించుకోకుండా తాను సిఫారసు చేసిన ఉద్యోగికి సీహెచ్‌వో పోస్ట్ ఇవ్వాలని పట్టుపడుతుండడంతో కమిషనర్ ఎటూ తేల్చుకోలేక పోతున్నట్లు సమాచారం.

బల్దియాలో అధికార పార్టీ నేతల జోక్యం

గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ పాలనలో అధికార పార్టీ నేతల జోక్యం ఎక్కువవుతున్నదనే విమర్శలు వస్తున్నాయి. కాంట్రాక్టర్ల బిల్లుల నుంచి ఇంటి పర్మిషన్లు, ఇతర పనులన్నీ వారే దగ్గరుండి చేయిస్తున్నారు. దీంతో బల్దియా పాలన గాడి తప్పింది. తాము స్వేచ్ఛగా విధులు నిర్వర్తించే పరిస్థితి లేదని స్వయంగా అధికారులే చెబుతున్నారు. అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్లలో సైతం వారి జోక్యం పెరుగుతున్నట్లు సమాచారం. కింది స్థాయి ఉద్యోగులైతే అధికార పార్టీ నేతలతో వణికిపోతున్నారు.

హోదాలు తేల్చండి

వివిధ శాఖల నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన ఇద్దరు అధికారుల హోదాలు తేల్చాలని కమిషనర్ బల్దియా అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ప్రస్తుతం హెచ్‌వోగా విధులు నిర్వర్తిస్తున్న రమేశ్ అటవీ శాఖలో డివిజనల్ రేంజ్ అధికారిగా పనిచేస్తూ బల్దియాకు డిప్యుటేషన్‌పై వచ్చారు. వ్యవసాయ శాఖలో మండల అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న లక్ష్మారెడ్డి ప్రస్తుతం డిప్యుటేషన్‌పై వచ్చారు. వీరిలో ఎవరి హోదా ఎక్కువైతే వారికే సీహెచ్‌వో బాధ్యతలు అప్పగించాల్సి ఉంది. వీటిని పట్టించుకోని సదరు ఎమ్మెల్యే తన సిఫారసుతో డిప్యుటేషన్ పై వచ్చిన ఉద్యోగికి సీహెచ్‌వో పోస్టు ఇవ్వాలని ఒత్తిడి తీసుకువస్తున్నారు. దీంతో కమిషనర్ ఇద్దరి ఉద్యోగుల ర్యాంక్, సీనియారిటీని పరిశీలించాలని ఆదేశించినట్లు సమాచారం.

ఇనుగుర్తి : కొనుగోలు కేంద్రలో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు సీతారాములు

డోర్నకల్ : గ్రెయిన్ మార్కెట్‌లో ధాన్యంపై కప్పిన టార్పాలిన్లపై నిలిచిన వర్షపు నీటిని తొలగిస్తున్న రైతులు

వడ్లు వర్షార్పణం

సర్కారు నిర్లక్ష్యం.. రైతన్నకు శాపం

- కొనుగోళ్లు ఆలస్యమై తడిసిన ధాన్యం
- మానుకోట, ములుగు జిల్లాల్లో తీవ్ర ప్రభావం
- మామిడికి తెగుళ్లు సోకే ప్రమాదం

బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో బుధవారం తెల్లవారుజాము నుంచి వర్షాలు కురిశాయి. వాతావరణ శాఖ నిత్యం చేసే వర్షం హెచ్చరికల్లో పలు జిల్లాలు లేనప్పటికీ వర్షం మాత్రం మోస్తరుగా కురిసింది. తక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ కొన్ని పంటలకు అపార నష్టం వాటిల్లింది. ముఖ్యంగా చాలాచోట్ల కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. మిరప కోతలు ఇప్పుడిప్పుడే మొదలు కాగా కోసి కల్లాల్లో ఆరబోసిన పంట అకస్మాత్తుగా కురిసిన వానకు ముద్దయింది. పంట దెబ్బతిని నాణ్యత కోల్పోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. టార్పాలిన్లు కప్పినప్పటికీ లోపల వేడి పెరిగి మిరప కాయలు నల్ల రంగులోకి మారుతాయని ఆవేదన చెందుతున్నారు. ఇక పూత దశలో ఉన్న మామిడిపైనా వర్షం ప్రభావం పడనున్నది. హనుమకొండ జిల్లాలో 5వేల ఎకరాల్లో మామిడి సాగవుతున్నది. ఈ ఏడాది సాగు ఆశాజనకంగా ఉందని రైతులు సంబురపడినప్పటికీ తాజా వర్షాలతో బూడిద తెగులు సోకే ప్రమాదం ఏర్పడింది. వచ్చిన పూత రాలిపోవడంతో పాటు నల్లబడిపోయే అవకాశాలున్నాయి.


వాజేడు : మిర్చి తోటలో నిలిచిన నీరు

గీత కార్మికులకు తీరని దెబ్బ

ప్రస్తుత వర్షాలు కేవలం రైతులకే కాకుండా గీత కార్మికులకు తీరని నష్టాన్ని కలిగించనున్నాయి. ఏటా అక్టోబర్ నెల మొదలు ఫిబ్రవరి, మార్చి వరకు పోద్దాడు కళ్లు అందుబాటులోకి వస్తుంది. ఈ సమయంలోనే గీత కార్మికులు నాలుగు రూపాయలు వెనకేసుకుంటారు. గ్రామాల్లో ఇప్పుడిప్పుడే పోద్దాడు గెలలు వస్తున్నాయి. అయితే ఈ పోద్దాడు కల్లు సమయంలో వర్షాలే కాదు, కేవలం ఆకాశంలో మబ్బులు కమ్మినా కూడా కల్లు గీతకు తీవ్ర ఆటంకం ఏర్పడే అవకాశం ఉంటుంది. తాజాగా కురుస్తున్న ఈ అకాల వర్షాల వల్ల గీత కార్మికులు పెద్ద ఎత్తున నష్టపోనున్నారని కార్మిక సంఘాలు ఆవేదన చెందుతున్నాయి.

సర్కారు నిర్లక్ష్యం వల్లే..

ఇనుగుర్తి : ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్లనే వర్షాలకు వడ్లన్నీ తడిసిపోయాయి. 28రోజుల క్రితం 315 బస్తాలు కేంద్రానికి తెచ్చిన. 10రోజుల క్రితం కాంటాలు పెడితే 125 క్వింటాలు అయినయ్. కాంటాలు అయినంక మిల్లులకు పంపలేదు. ఇంతలో వర్షం పడి వడ్లు తడిశాయి. మాకు ఎలాంటి కట్టింగ్ లేకుండా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం మిల్లులకు తరలించాలి.

– పత్తిపాక నీతారాములు, రైతు ఇనుగుర్తి

వరి రైతుకు కన్నీరే మిగిలింది. ఆరుగాలం శ్రమించి సాగుచేసిన పంటను కాంగ్రెస్ సర్కారు సకాలంలో కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యం చేయడం, ఇంతలో మాయదారి వాన అందుకోవడంతో ఆరబోసిన ధాన్యం వర్షానికి తడిసి ముద్దయింది. మంగళవారం సాయంత్రం నుంచి తేలికపాటి జల్లులతో మొదలై బుధవారం తెల్లవారుజాము వరకు ఉమ్మడి జిల్లాలోని పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా మహబూబాబాద్, ములుగు, నర్సంపేట సహా చాలా గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లోకి వరద నీరు చేరింది. దీంతో నీటిని ఎత్తిపోసి, తడిసిన వడ్లను ఆరబోసుకుంటూ పంటను కాపాడుకునేందుకు నానా పాట్లు పడాల్సి వచ్చింది. సర్కారు కొంటుందనే నమ్మకం లేకపోవడంతో చేసేదేమీలేక ధాన్యం బస్తాలను ఇంటికి తీసుకెళ్లడం కనిపించింది. అలాగే వర్షంతో మామిడికి తెగుళ్లు సోకే ప్రమాదం ఉండగా పలుచోట్ల ఆరబోసిన మిర్చి కూడా తడిసిపోయింది. మరో రెండు రోజులు వర్షాలు పడే సూచనలు ఉండడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

- హనుమకొండ సబర్బన్, డిసెంబర్ 25

కాంటా పెట్టి 10 రోజులైంది

కేసముద్రం : సుమారు 15 రోజుల క్రితం కల్వల కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చాను. ఈ నెల 15న కాంటాలు నిర్వహించారు. లారీలు రాకపోవడం వల్ల 10 రోజుల నుంచి బస్తాలు కొనుగోలు కేంద్రాల్లోనే ఉన్నాయి. వర్షం పడడంతో వరద నీటితో బస్తాలు తడిసిపోయాయి. ధాన్యానికి మొలకవస్తే ఎవరు బాధ్యత వహించాలి. తడిసిన వడ్లు తీసుకోవాలి. వెంటనే లారీలను పంపించి ధాన్యాన్ని తరలించాలి.

– గుగులోత్ కల్పన, నారాయణపురం, రైతు

ఇనుగుర్తి : కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం బస్తాలను ట్రాక్టర్‌లో ఇంటికి తీసుకెళ్తున్న రైతు ఇస్లావత్ రాజు

గుళికలు కొంటేనే యూరియా

- కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు
- ఎమ్మార్పీ కంటే అదనంగా విక్రయాలు
- పట్టించుకోని వ్యవసాయాధికారులు
- తూతూ మంత్రంగా తనిఖీలు
- ఇబ్బందులు పడుతున్న రైతులు

నల్లబెల్లి, డిసెంబర్ 25 : రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో యూరియా కోసం అన్నదాతలు తండ్లాడుతున్నారు. ఈ ఏడాది ఆశించిన మేర పత్తి పంట దిగుబడి రాకపోవడంతో దానిని తొలగించి మిరప, మక్కజొన్న, నువ్వులు తదితర పంటలను సాగుచేస్తున్నారు. ప్రధానంగా మక్కజొన్న, మిరప, వరి పంటలకు అవసరమైన మేరకు రాష్ట్ర ప్రభుత్వం యూరియా సరఫరా చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే అదనుగా భావించిన పలువురు ఎరువుల డీలర్లు యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తూ అధిక ధరకు విక్రయిస్తున్నారని మండల రైతులు ఆరోపిస్తున్నారు. ఒక్కో యూరియా బస్తాకు ఎమ్మార్పీ రూ. 265 ఉండగా అధికంగా రూ. 330 నుంచి రూ. 350 వరకు విక్రయిస్తున్నారు. దీనికి అదనంగా బయో గుళికలను అంటగడుతూ మరో రూ. 900 వసూలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఫిర్యాదు చేస్తున్నప్పటికీ వ్యవసాయ శాఖ అధికారులు తూతూ మంత్రంగా ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తూ చేతులు దుపుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా మండల కేంద్రంలోని ముగ్గురు, నందిగామకు చెందిన ఒక డీలర్ యూరియా కృత్రిమ కొరతను సృష్టిస్తూ అక్రమ వ్యాపారం చేస్తున్నారని బాధిత రైతులు తెలిపారు. ఇదిలా ఉంటే ఇఫ్‌కో, ఆర్‌సీఎఫ్, క్రిబ్‌కో తదితర కంపెనీల డిస్ట్రిబ్యూటర్లు రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగానే బయో గుళికల లింకును పెడుతున్నారని, దీని కారణంగానే రైతులకు డీలర్లు విక్రయిస్తున్నారని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కృత్రిమ కొరతను అరికట్టి ఎమ్మార్పీ ధరకే యూరియా విక్రయించేలా చర్యలు చేపట్టాలని మండల రైతులు కోరుతున్నారు.

నల్లబెల్లిలో యూరియా దిగుమతి చేస్తున్న హమాలీలు (ఫైల్)

బయో గుళికలతో నష్టపోతున్నాం

యూరియా కావాలంటే బయో గుళికలు కొనాల్సిందేనని డీలర్లు అంటున్నారు. దీంతో రూ. 900 అదనంగా నష్టపోతున్నాం. అంతేగాక యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తూ డీలర్లు నిలువు దోపిడీ చేస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే మా దగ్గర యూరియా లేదంటూ బుకాయిస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అమ్యామ్యాలకు అలవాటు పడి తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. గిట్టితే యాసంగి పంటలు పండించలేము. మళ్లీ పాతరోజులు వస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి యురియా కొరతను అరికట్టి డీలర్ల దోపిడీని నియంత్రించాలి.

– కన్నెబోయిన కుమారస్వామి, రైతు, శంషాబాద్

పులి క్షేమమేనా?

- ఇటీవల తాడ్వాయి అడవుల్లో సంచారం
- ప్రస్తుతం జాడ దొరకకపోవడంతో అధికారుల్లో కలవరం
- పొంచి ఉన్న వేటగాళ్ల ముప్పు
- రెండేళ్ల క్రితం లింగాల ప్రాంతంలో ఉచ్చుకు బలి

తాడ్వాయి, డిసెంబర్ 25 : ఇటీవల తాడ్వాయి అడవుల్లో సంచరించిన పెద్దపులి మళ్లీ జాడ లేకుండా పోవడం అనుమానాలకు తావిస్తోంది. పది రోజులుగా వైల్డ్‌లైఫ్ అధికారులు పులి పాదముద్రలను గుర్తించగా, గత శనివారం లవ్వాల అటవీ ప్రాంతం మీదుగా లింగాల అడవుల్లోకి వెళ్లినట్లు చెబుతున్నారు. అప్పటినుంచి కదలికలు కానరాకపోవడంతో పెద్దపులి క్షేమమేనా? వేటగాళ్లతో ప్రమాదం పొంచి ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రెండేళ్ల క్రితం ఇదే లింగాల ప్రాంతంలో ఓ పులి వేటగాళ్ల ఉచ్చుకు బలైన నేపథ్యంలో అటవీ అధికారులు పులి జాడ కోసం అన్వేషిస్తున్నారు. రెండేళ్ల క్రితం మహారాష్ట్ర అడవుల నుంచి తాడ్వాయి మండలంలోని అడవులకు వచ్చిన పులి ఇదే లింగాల అటవీ ప్రాంతంలో వేటగాళ్లు అడవి జంతువుల కోసం అమర్చిన ఉచ్చుకు బలైంది. నాలుగు నెలల తర్వాత స్పెషల్ పార్టీ పోలీసులకు పులి ఎముకలు కనిపించడంతో అధికారులకు సమాచారమిచ్చారు. వారు పరిశీలించి అది పులి కళేబరంగా నిర్ధారించి ట్రాప్‌లు ఏర్పాటు చేసిన వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. అయితే పది రోజుల క్రితం తాడ్వాయి అడవుల్లోకి ప్రవేశించిన పులి ఇప్పటివరకు ఇతర ప్రాంతాలకు వెళ్లలేదు. దీంతో అధికారులకు సవాల్‌గా మారింది. గతంలో జరిగిన సంఘటన పునరావృతం అవుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. పులి సురక్షితంగా ఇతర ప్రాంతాలకు వెళ్లేలా అటవీ గ్రామాల ప్రజలను ఎప్పటికప్పుడు కలుస్తూ పులికి హాని తలపెట్ట వద్దని, ఒకవేళ పులి వల్ల ఏదైనా నష్టం జరిగితే అటవీ శాఖ భరిస్తుందని అవగాహన కల్పిస్తున్నారు. కానీ వేటగాళ్లు అవి పాటిస్తారా అనే అనుమానం లేకపోలేదు. శనివారం లవ్వాల అటవీ ప్రాంతంలో పులి పాదముద్రలు గుర్తించినప్పటికీ రెండు రోజులుగా పులి జాడ కనిపించడం లేదు. అధికారులు బృందాలుగా ఏర్పడి రెండు రోజులుగా నాలుగు వైపులా పులి జాడ కోసం వెతుకుతున్నారు. అయినప్పటికీ పులి జాడ లేకపోవడంతో అధికారుల్లో కలవరం మొదలైంది. పులి సురక్షితంగా ఉందా? లేదా వేటగాళ్ల ఉచ్చుకు చిక్కిందా? అని తలలు పట్టుకుంటున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పులి జాడ కోసం విస్తృతంగా గాలిస్తున్నా ఫలితం ఉండడం లేదు. దీంతో పులి కనిపించకపోవడం జిల్లా వైల్డ్‌లైఫ్ అధికారులకు నిద్రలేకుండా చేస్తున్నది.

ఎట్టకేలకు అందుబాటులోకి అంబులెన్స్

నమస్తే కథనానికి స్పందన

ఇనుగుర్తి, డిసెంబర్ 25 : 'అంబులెన్స్‌పైనా ఆధిపత్య పోరేనా' శీర్షికన ఈ నెల 11న నమస్తే తెలంగాణ మెయిన్ పేజీలో ప్రచురితమైన కథనానికి మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ స్పందించి బుధవారం ఇనుగుర్తి పీహెచ్‌సీలో కొత్త 108 అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఇటీవల హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి మానుకోటకు ఏడు అంబులెన్స్‌లు ప్రకటించగా, అందులో ఇనుగుర్తి పీహెచ్‌సీకి ఒకటి కేటాయించి, అనంతరం రెండో లిస్ట్‌లో దానిని రద్దు చేశారు. మండల ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తం కావడంతో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తన ప్రత్యేక నిధులతో ఇనుగుర్తికి కొత్త అంబులెన్స్ కేటాయించగా ఎమ్మెల్యే మురళీనాయక్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

హనుమకొండలో భిక్షాటన చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

భిక్షాటన చేసి.. బజ్జీలు పంచి!

సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కిన సమగ్ర శిక్షా ఉద్యోగులు మొక్కవోని దీక్షతో ముందుకుసాగుతున్నారు. బుధవారం హనుమకొండలో వర్షంలోనూ ఉద్యోగులు భిక్షాటన చేయగా, జనగామలో శిబిరం వద్ద మిర్చి బజ్జీలు కాల్చి ఆర్టీసీ బస్సులో ప్రయాణికులకు పంచి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఉద్యోగులందరినీ విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేసే వరకూ సమ్మె కొనసాగిస్తామని వారు స్పష్టంచేశారు.

- జనగామ, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ)/ హనుమకొండ

జనగామలో ప్రయాణికులకు మిర్చి బజ్జీలు ఇస్తూ నిరసన తెలుపుతున్న ఉద్యోగులు